

పటిష్టమైన ప్రజాస్వామ్యానికి ఓటే పునాది

- అరకులోయ అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీవో అభిషేక్
- పలు పోలింగ్ కేంద్రాల పరిశీలన
- ఎన్నికల విధులపై అధికారులకు అవగాహన

- వార్త 6వ పేజీలో..



ఎన్నికల సందడి

కోడ్ అమలు

- రూ.50 వేలకు మించి నగదు తీసుకువెళ్లకూడదు
- వ్యాపారులకు ముందస్తు అనుమతి తప్పనిసరి

ఎన్నికల షెడ్యూల్	
నోటిఫికేషన్	18-04-2024
నామినేషన్ల గడువు	25-04-2024
నామినేషన్ల పరిశీలన	26-04-2024
ఉపసంహరణ	29-04-2024
పోలింగ్ తేదీ	13-05-2024
ఓట్ల లెక్కింపు	04-06-2024

- రాత్రి 10 వరకే ఎన్నికల ప్రచారం
- రాత్రి 11 గంటలకు బార్లు మూసివేయాల్సిందే
- ఏప్రిల్ 18న ఎన్నికల ప్రకటన
- మే 13న పోలింగ్
- జూన్ 4 కౌంటింగ్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఎన్నికల నగారా మోగింది. ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చింది. ఇప్పటివరకు విచ్చలవిడిగా అధికార పార్టీనేతల అడుగులకు మడుగులొత్తిన అధికారులు ఇకపై అలా చేయడానికి వీల్లేదు. వలంటీర్లు స్థానిక నాయకులతో చెట్టపట్టాలేసుకొని తిరిగితే కుదరదు. ఎమ్మెల్యే అభ్యర్థి ఇచ్చారనో, ఎంపీ పంపారనో కానుకలు తీసుకొని ఇంటింటికీ వెళితే...చర్యలకు గురికావలసి ఉంటుంది. వలంటీర్లు ఎన్నికల విధులు, రాజకీయ వ్యవహారాలకు దూరంగా ఉండాలని ఎన్నికల సంఘం స్పష్టంచేసింది. ఎన్నికల ప్రవర్తన నియమావళిని కచ్చితంగా అమలు చేస్తామని జిల్లా యంత్రాంగం ప్రకటించింది.

ఎన్నికల సంఘం కొరడా ఝుళిపించడం ప్రారంభించింది. పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టంలో శనివారం భద్రతా దళాలు మార్చ్ ఫాస్ట్ నిర్వహించగా, అందులో స్థానిక నాయకుడు ఒకరు ముందుండి నడిచారు. ఆ పక్కనే ఎస్.ఐ. గోవిందరావు ఉన్నా వారించకుండా కలిసి నడవడంతో ఆయన్ను సస్పెండ్ చేస్తూ ఎన్నికల సంఘం ఆదేశాలు ఇచ్చింది.

ఏప్రిల్ 18న ఎన్నికల ప్రకటన

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికలకు సంబంధించి ఏప్రిల్ 18న ప్రకటన విడుదల అవుతుంది. ఏప్రిల్ 25 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 26న వాటిని పరిశీలిస్తారు. అభ్యర్థుల ఉపసంహరణకు 29 వరకు అవకాశం ఉంది. మే 13న పోలింగ్ నిర్వహిస్తారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

నగదు రవాణాపై ఆంక్షలు

ఎన్నికల ప్రక్రియ ముగిసేంత వరకు నగదు రవాణాపై ఆంక్షలు ఉంటాయి. ఎవరైనా సరే రూ.50 వేలకు మించి తీసుకువెళ్లకూడదు. అలా ఏమైనా చేస్తే స్వాధీనం చేసుకుంటారు. వ్యాపార అవసరాల కోసం తీసుకెళితే ముందుగానే అనుమతి తీసుకోవాలి.

ప్రచారంపై ఆంక్షలు

ఎన్నికల ప్రచారం ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకే అనుమతిస్తారు. ప్రభుత్వ భవనాలు, కార్యాలయాలు, ఇతర ఆస్తులపై ప్రచారానికి సంబంధించిన పోస్టర్లు, ఫ్లెక్సీలు ఉంటే తొలగించాలి. ఎంపీ అభ్యర్థి రూ.95 లక్షలు, ఎమ్మెల్యే అభ్యర్థి రూ.40 లక్షలు వరకు ఖర్చు పెట్టవచ్చు.

అమల్లోకి ఎన్నికల కోడ్

రంగంలోకి దిగిన అధికార యంత్రాంగం

- పాడేరులో రాజకీయ పార్టీల హోర్డింగ్‌లు, కటౌట్‌లు, ఫ్లెక్సీల తొలగింపు



పాడేరులో రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను తొలగిస్తున్న దృశ్యం



పాడేరు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శనివారం సాయంత్రం నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో అధికార యంత్రాంగం రంగంలోకి దిగింది. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం బహిరంగ ప్రదేశాల్లో రాజకీయ పార్టీలకు సంబంధించిన హోర్డింగ్‌లు, కటౌట్‌లు, ఫ్లెక్సీల తొలగింపు ప్రక్రియకు అధికారులు శ్రీకారం చుట్టారు. స్థానిక పీటీడీ బస్ కాంప్లెక్స్, ఐటీడీఏ కార్యాలయానికి సమీపంలో వివిధ రాజకీయ పార్టీలు ఇబ్బిడి ముబ్బిడిగా పెట్టిన కటౌట్‌లు, ఫ్లెక్సీలను అధికారులు యుద్ధప్రాతిపదికన తొలగించారు. నోటిఫికేషన్ వచ్చిన 24 గంటల్లో ప్రభుత్వ కార్యాలయాల్లో, 48 గంటల్లో బహిరంగ ప్రదేశాల్లో, 72 గంటల్లో ప్రైవేటు ప్రదేశాల్లో రాజకీయ సంబంధ అంశాలను విధిగా తొలగించాలని ఇప్పటికే కలెక్టర్ విజయసునీత రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశాల్లో స్పష్టం చేశారు. అలాగే డివిజన్, మండల స్థాయిలో అధికారులు ఎన్నికల ప్రవర్తనా నియామవళిని పక్కాగా అమలు చేయాలని ఆమె ఆదేశాలు జారీ చేశారు.

సిట్టింగ్‌లకు జగన్ ఝలక్

ఎంపీ మాధవి, ఎమ్మెల్యేలు భాగ్యలక్ష్మి, ఫాల్గుణకు మొండి చేయి

- అరకులోయ ఎంపీ, పాడేరు, అరకులోయ ఎమ్మెల్యే స్థానాలకు కొత్త ముఖాలు
- అరకులోయ ఎంపీ అభ్యర్థిగా తనుజారాణి, పాడేరు అసెంబ్లీకి మత్స్యరాస విశ్వేశ్వరరాజు, అరకులోయకు రేగం మత్స్యలింగం



గొడ్డేటి మాధవి, అరకు ఎంపీ



కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, పాడేరు ఎమ్మెల్యే



చెట్టి ఫాల్గుణ, అరకు ఎమ్మెల్యే

(ఆంధ్రజ్యోతి- పాడేరు)

మన్యంలోని అరకులోయ పార్లమెంట్, పాడేరు, అరకులోయ అసెంబ్లీ స్థానాల సిట్టింగ్‌లకు జగన్ ఝలక్ ఇచ్చారు. ముగ్గురికీ రానున్న ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం కల్పించలేదు. వారి స్థానంలో కొత్త వారికి అవకాశం కల్పించారు.

తొలుత అరకులోయ పార్లమెంట్ స్థానానికి పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మిని ఎంపిక చేసి ఆమెను పార్లమెంట్ సమన్వయకర్తగా నియమించారు. అలాగే అరకులోయ అసెంబ్లీకి సిట్టింగ్ ఎంపీ గొడ్డేటి మాధవిని, పాడేరుకు ఎస్టీ కమిషన్ సభ్యుడిగా ఉన్న మత్స్యరాస విశ్వేశ్వరరాజును సమన్వయకర్తలుగా నియమించారు. అరకులోయ ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణను పక్కన పెట్టారు.

తొలుత మాధవి...

ఆ తరువాత భాగ్యలక్ష్మి అవుట్

ఏజెన్సీలో అరకులోయ అసెంబ్లీ స్థానానికి సిట్టింగ్ ఎంపీ గొడ్డేటి మాధవిని సమన్వయకర్తగా నియమించడంపై ఆ ప్రాంత వైసీపీ నేతలు, కార్యకర్తలు తీవ్రంగా వ్యతిరేకించారు. ఆమె అరకులోయ ఎంపీ అయినప్పటికీ, ఆ ప్రాంతంలో పర్యటించకపోవడం, అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని అరకులోయ, అనంతగిరి, డుంబ్రిగుడ, హుకుంపేట, పెదబయలు, ముంచంగిపుట్టు మండలాలకు చెందిన నేతలతో కనీస సఖ్యత లేదని, ఈ ప్రాంతం అభివృద్ధి, సంక్షేమానికి ఆమె కనీసం కృషి చేయలేదని ఆ పార్టీ నేతలు విమర్శించారు. కేవలం కార్యక్రమాల్లో పాల్గొనేందుకు మాత్రమే రావడం తప్ప ఎంపీగా తన పరిధిలోని పార్టీ క్యాడర్, ప్రజల కష్టాసుఖాలపై ఆమె దృష్టిపెట్టిన దాఖలాలు లేవని ఆరోపించారు. ఈ క్రమంలో ఆమెను అరకులోయ అసెంబ్లీ స్థానానికి సమన్వయకర్తగా నియమించడంతో ఇన్నాళ్లు నివురుగప్పిన నిప్పులా ఉన్న వైసీపీ శ్రేణుల్లోని అసంతృప్తి ఒక్కసారిగా బయటకు వచ్చింది. గొడ్డేటి మాధవిని బరిలోకి దింపితే అందరం ఐక్యంగా ఓడిస్తామని వైసీపీ నేతలు హెచ్చరిస్తూ ఆందోళనలు చేపట్టారు. దీంతో దిగివచ్చిన అధిష్ఠానం మాధవిని పక్కన పెట్టి, హుకుంపేట జడ్పీటీసీ సభ్యుడిగా ఉన్న కొండదొర సామాజిక వర్గానికి చెందిన రేగం మత్స్యలింగంను అరకులోయ అసెంబ్లీ స్థానానికి సమన్వయకర్తగా నియమించింది. అలాగే అరకులోయ పార్లమెంట్ స్థానానికి సమన్వయకర్తగా వున్న భాగ్యలక్ష్మిని తప్పించి, వాల్మీకి సామాజిక వర్గానికి అవకాశం కల్పించాలని వైసీపీ నేతలు, వాల్మీకి కుల సంఘాల ప్రతినిధులు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చారు. దీంతో ఆఖరి నిమిషంలో అనూహ్యంగా భాగ్యలక్ష్మిని తప్పించి, ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ కోడలైన డాక్టర్ తనుజారాణిని అరకులోయ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించారు.

ముగ్గురూ కొత్త ముఖాలే..



చెట్టి తనుజారాణి, అరకు ఎంపీ అభ్యర్థి



మత్స్యరాస విశ్వేశ్వరరాజు, పాడేరు అసెంబ్లీ అభ్యర్థి



రేగం మత్స్యలింగం, అరకు ఎమ్మెల్యే అభ్యర్థి

ఏజెన్సీలో అరకులోయ ఎంపీ, పాడేరు, అరకులోయ ఎమ్మెల్యే స్థానాలకు పోటీ చేస్తున్న ముగ్గురు అభ్యర్థులు కొత్త ముఖాలే. హుకుంపేట మండలం అడ్డుమండ పంచాయతీ సర్పంచ్ గుమ్మా శ్యామ్‌సుందర్ కుమార్తె, అరకులోయ ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణ ... మిగతా 6వ పేజీలో

ఈ ఇద్దరికే ఎందుకిలా..?

చర్చనీయాంశంగా మారిన పాడేరు, అరకులోయ ఎమ్మెల్యేల వ్యవహారం

- అరకులోయ పార్లమెంట్ పరిధిలో సీట్లు దక్కనిది ఈ ఇద్దరికే
- మిగిలిన ఐదుగురు సిట్టింగ్‌లకు దక్కిన చాన్స్

(ఆంధ్రజ్యోతి- పాడేరు)

అరకులోయ పార్లమెంట్ నియోజకవర్గ ఏడు అసెంబ్లీ స్థానాల్లో కేవలం పాడేరు, అరకులోయ సిట్టింగ్ ఎమ్మెల్యేలకు మాత్రమే సీట్లు దక్కకపోవడం అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో చర్చనీయాంశమైంది. అరకులోయ పార్లమెంట్ స్థానం పరిధిలో అరకులోయలో చెట్టి ఫాల్గుణ, పాడేరులో కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, రంపచోడవరంలో నాగులాపల్లి ధనలక్ష్మి, కురుపాంలో పాముల పుష్పశ్రీవాణి, సాలూరులో పీడిక రాజన్నదొర, పార్వతీపురం అలజంగి జోగారావు, పాలకొండలో విశ్వసరాయి కళావతి ఎమ్మెల్యేలుగా వున్నారు. కానీ శనివారం వైసీపీ అధిష్ఠానం ప్రకటించిన అసెంబ్లీ సీట్ల జాబితాలో పాడేరు, అరకులోయ ఎమ్మెల్యేలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, చెట్టి ఫాల్గుణలకు చోటు దక్కలేదు. కానీ మిలిగిన ఐదు అసెంబ్లీ స్థానాల్లో మాత్రం సిట్టింగ్ ఎమ్మెల్యేలకే టికెట్లు ఇచ్చారు. ఈ తరుణంలో ఈ ఇద్దరికీ ఎందుకు టికెట్లు దక్కలేదనే అంశం ప్రధానంగా చర్చనీయాంశమైంది.

ఉక్కు ప్రైవేటీకరణకు ఒప్పుకోం

- ప్లాంటు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కాంగ్రెస్ డిక్లరేషన్



అభివాదం చేస్తున్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షురాలు షర్మిల



సభకు భారీ సంఖ్యలో హాజరైన ఉక్కు ఉద్యోగులు, ప్రజలు

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 16: విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ డిక్లరేషన్ ప్రకటించింది. ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు తాము ఎట్టి పరిస్థితుల్లో ఒప్పుకోబోమని, తమ ప్రాణాలు అడ్డు పెట్టయినా పోరాడతామని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రకటించారు. శనివారం ఉక్కు నగరంలోని తృష్ణా మైదానంలో స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిర్వహించిన 'న్యాయ సాధన సభలో ఆమె పాల్గొని ప్రసంగించారు. ఉక్కు పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని, ఎప్పుడు పిలిచినా వెంటనే వస్తానని ప్రకటించారు. సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ దేవాలయం లాంటి ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకునేందుకు ప్రజలు, కార్మికులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ నరసింగరావు మాట్లాడుతూ ప్రభుత్వ రంగంలో ఉన్న సంస్థను కాపాడుకుంటే అన్నివర్గాల ప్రజలకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ సమావేశానికి పీసీసీ మాజీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు అధ్యక్షత వహించగా, తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు కేవీపీ రామచంద్రరావు, కనుమూరి బాపిరాజు, తులసీరెడ్డి, రాకేష్‌రెడ్డి, మయ్యప్పన్, కొయ్య ప్రసాద్‌రెడ్డి, గొంప గోవిందరావు, జెర్రిపోతుల ముత్యాలు, పాశర్ల ప్రసాద్, కేఎస్ఎన్ రావు, నీరుకొండ రామచంద్రరావు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టో పోస్టర్‌ను రేవంత్‌రెడ్డి, షర్మిలల ఆవిష్కరించారు.

టెన్త్ పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు

- పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులు 12,051 మంది
- 65 కేంద్రాల్లో నిర్వహణ
- కలెక్టర్ ఎం.విజయసునీత



మాట్లాడుతున్న కలెక్టర్ విజయసునీత

పాడేరు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ నెల 18 నుంచి 30వ తేదీ వరకు జరిగే పదో తరగతి వార్షిక పరీక్షల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను పక్కాగా చేశామని కలెక్టర్ విజయసునీత తెలిపారు. తన కార్యాలయంలో శనివారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో 22 మండలాల పరిధిలో 65 పరీక్షా కేంద్రాల్లో 12,051 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారన్నారు. వారిలో 10,986 మంది రెగ్యులర్, 1,065 మంది ప్రైవేటు విద్యార్థులున్నారన్నారు. మొత్తం విద్యార్థుల్లో 5,066 మంది బాలురు, 5,920 మంది బాలికలున్నారని కలెక్టర్ తెలిపారు. అలాగే 22 పోలీస్‌స్టేషన్లను పాయింట్‌లుగా గుర్తించామని, పది రూట్‌లుగా విభజించామన్నారు. అలాగే పరీక్షల నిర్వహణకు 65 మంది చీఫ్ సూపరింటెండెంట్‌లు, 65 మంది డిపార్టుమెంట్ ఆఫీసర్లు, నలుగురు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను, 634 మంది ఇన్విజిలేటర్లను నియమించామన్నారు.

సార్వత్రిక టెన్త్, ఇంటర్ పరీక్షలకు 3,981 మంది..


ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 18 నుంచి 27 వరకు జరిగే సార్వత్రిక టెన్త్, ఇంటర్ పరీక్షలకు 3,981 మంది హాజరవుతారని కలెక్టర్ తెలిపారు. ఆయా పరీక్షలకు సంబంధించిన ఏర్పాట్లను చేశామన్నారు. అలాగే సార్వత్రిక టెన్త్ పరీక్షలకు పాడేరు రెవెన్యూ డివిజన్‌లో ఆరు, రంపచోడవరం డివిజన్‌లో మూడు, ఇంటర్ పరీక్షలకు పాడేరులో నాలుగు, రంపచోడవరం డివిజన్‌లో ఐదు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అన్ని పరీక్షా కేంద్రాల్లోనూ కనీస సదుపాయాలు కల్పించారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు, గిరిజన సంక్షేమ విద్యాశాఖ ఉప సంచాలకుడు ఐ.కొండలరావు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (ఆది)	6.11
సహరి (సోమ)	4.50

వైసీపీ పాలనలో ఆదివాసీలకు అన్యాయం

- భారత్ ఆదివాసీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాజబాబు



మొట్టడం రాజబాబు

చింతపల్లి, మార్చి 16: వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆదివాసీలకు అన్యాయం జరుగుతోందని, దీనిపై మేధావులు, విద్యావంతులు స్పందించాలని భారత్ ఆదివాసీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మొట్టడం రాజబాబు కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ గిరిజన వ్యతిరేక విధానాలపై ఆదివాసీ మేధావులు, విద్యావంతులు మౌనం వహిస్తే జాతికి తీరని నష్టం జరుగుతుందన్నారు. జీవో నంబరు-3ను దేశ అత్యున్నత న్యాయస్థానం రద్దు చేస్తే పునరుద్ధరించేందుకు వైసీపీ ప్రభుత్వం కనీస చర్యలు తీసుకోలేదన్నారు. బోయవాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చుతూ రాష్ట్ర కేబినెట్ తీర్మానం చేసినప్పటికి గిరిజన ఎమ్మెల్యేలు, ఎంపీలు నోరు విప్పలేదన్నారు. యర్రవరం హైడ్రో పవర్ ప్రాజెక్టు వల్ల 33 గిరిజన గ్రామాలు, వందల ఎకరాల వ్యవసాయ భూములు ముంపునకు గురవుతాయని ఆదివాసీలు ఆందోళన చేస్తున్నప్పటికి గిరిజన ఎమ్మెల్యేలు పెడచెవిన పెట్టారన్నారు. గిరిజన ప్రాంతంలో గ్రానైట్, లేటరైట్ తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయని, వైసీపీ నాయకులు మైనింగ్ మాఫియా పెట్టుబడిదారులుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం గిరిజన సంపదను దోచుకునేందుకు జాతీయ రహదారి నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయని, ప్రతి గ్రామంలోనూ సెల్ టవర్లు విచ్చలవిడిగా నిర్మిస్తున్నారన్నారు. జాతీయ రహదారి, సెల్ టవర్ల వల్ల ఆదివాసీలకు నష్టమే జరుగుతుంది తప్ప, ఎటువంటి మేలు జరగదని చెప్పారు.



విద్యార్థి మేనిఫెస్టో విడుదల చేస్తున్న ఏబీవీపీ నాయకులు, అధ్యాపకులు

విద్యార్థుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం ఘోర వైఫల్యం

» ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఆనంద్

పాడేరు రూరల్, మార్చి 16: రాష్ట్రంలో విద్యార్థులు, నిరుద్యోగ యువత సమస్యలను పరిష్కరించడంలో వైసీపీ ప్రభుత్వం అత్యంత ఘోరంగా వైఫల్యం చెందిందని ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు అంగనైని ఆనంద్ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద విద్యా రంగ పునరుజ్జీవం కోసం విద్యార్థి మేనిఫెస్టో కరపత్రాలను శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకు సమస్యలే దర్శనమిస్తున్నాయన్నారు. వేల సంఖ్యలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయకపోగా, పది వేలకు పైగా పాఠశాలలను మూసేసి సుమారు ఆరు లక్షల మంది విద్యార్థులను ప్రభుత్వ పాఠ శాలలకు దూరం చేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. యూనివర్సిటీ నిధులను ప్రభుత్వ ఖాతాల్లోకి మళ్లించడం, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించకపోవడం, జాబ్ క్యాలెండర్ ఊసే లేకపోవడం, గిరిజన విద్యార్థులు అనారోగ్యాల బారినపడి మృతి చెందుతున్నా విచారణ చేపట్టకపోవడం వంటి అనేక సమస్యలు ఆంధ్రప్రదేశ్ విద్యా రంగాన్ని పట్టిపీడిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 23,100 ఉపాధ్యాయ పోస్టులను మెగా డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలని, విలీన పాఠశాలల జీవోను రద్దు చేసి మూతపడిన పది వేల పాఠశాలలను తెరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు పి.ఉపేంద్ర, పి.సూర్యారావు, వంశీకృష్ణ, జయకుమార్, చందు, శ్రీను, కృష్ణ, కళాశాల అధ్యాపకులు అనురాధ, విజయలక్ష్మి, అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఉచిత గ్యాస్ కనెక్షన్లలో చేతివాటం

» లబ్ధిదారుల నుంచి గొడౌన్ మేనేజర్ అక్రమ వసూళ్లు

» గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కూడా రాధాకృష్ణ డిమాండ్



గ్యాస్ కనెక్షన్ లబ్ధిదారుల నుంచి వివరాలు సేకరిస్తున్న రాధాకృష్ణ

పాడేరు రూరల్, మార్చి 16: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఉజ్వళ పథకంలో ఉచితంగా అందించాల్సిన వంట గ్యాస్ కనెక్షన్లలో ఐటీడీఏ గ్యాస్ గొడౌన్ మేనేజర్ చేతివాటం ప్రదర్శిస్తున్నారని గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కూడా రాధాకృష్ణ ఆరోపించారు. శనివారం గొడౌన్ వద్దకు చేరుకొని కొత్త కనెక్షన్‌లు పొందుతున్న లబ్ధిదారులతో ఆయన మాట్లాడి వివరాలు సేకరించారు. అనంతరం విలేకరులతో రాధాకృష్ణ మాట్లాడుతూ కనెక్షన్‌కు రూ.1,000 నుంచి రూ.2,000 వరకు గ్యాస్ గొడౌన్ మేనేజర్ అక్రమంగా వసూలు చేస్తున్నట్టు తెలిసిందన్నారు. నగదు తీసుకున్నప్పటికీ తుప్పుపటిన పాత గ్యాస్ స్టవ్‌లను లబ్ధిదారులకు అంటగట్టడం అన్యాయమన్నారు. ఐటీడీఏ అధికారులు స్పందించి ఈ వ్యవహారంపై విచారణ చేసి తగిన చర్యలు చేపట్టాలని, లబ్ధిదారుల నుంచి అక్రమంగా వసూలు చేసిన నగదును తిరిగి చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో లబ్ధిదారులతో కలిసి ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

అరకులో చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దొన్నుదొర

అరకులోయ, మార్చి 16: ప్రముఖ పర్యాటక కేంద్రం అరకులోయ నాలుగు రోడ్ల కూడలిలో పార్టీ అభ్యర్థి అరకు సియ్యారి దొన్నుదొర శనివారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. వేసవి ప్రారంభం కావడం, ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో ప్రజల సౌకర్యార్థం పెదలబుడు సర్పంచ్ దాసుబాబు, పార్టీ నేతలు ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శెట్టి బాబూరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

అయోధ్యకు పాదయాత్ర



అయోధ్యకు నడిచి వెళ్తూ జి.మాడుగుల చేరుకున్న స్వామిజీ, భక్తులు

జి.మాడుగుల, మార్చి 16: లోక కల్యాణం, ప్రపంచ శాంతి కోరుతూ అయోధ్య బాలరాముడి దర్శన నిమిత్తం పాదయాత్ర చేపడుతున్నట్టు శ్రీరామనందస్వామి తెలిపారు. చింతపల్లి మండలం శ్రీకృష్ణపురం నుంచి శనివారం బయలుదేరి జి.మాడుగుల మండలం చేరుకోగా, స్థానిక భక్తులు హారతినిచ్చి స్వామిజి ఆహ్వానించారు. అనంతరం ఇక్కడి నుంచి పలువురు భక్తులు అయోధ్య పాదయాత్రకు బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో సర్పంచ్ రాంబాబు పాల్గొన్నారు.

మూడు నాటు తుపాకులు సరెండర్



నాటు తుపాకులు సరెండర్ చేసిన గిరిజనులతో సీఐ, ఎస్ఐ

గూడెంకొత్తవీధి, మార్చి 16: మండలంలోని రింతాడ పంచాయతీ కొత్తబంద గ్రామానికి చెందిన ముగ్గురు గిరిజనులు స్వచ్ఛందంగా మూడు నాటు తుపాకులను స్టేషన్‌లో సరెండర్ చేశారని సీఐ బి.అప్పలనాయుడు తెలిపారు. శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో సంప్రదాయంగా కొంత మంది ఆదివాసీలు నాటు తుపాకులను వేట కోసం వినియోగిస్తున్నట్టు తమకు సమాచారం ఉందన్నారు. వీటిని పోలీసులకు అప్పగించాలని, లేనిపక్షంలో జైలు శిక్ష పడుతుందని పత్రిక ముఖంగా ప్రకటించడంతో కొత్తబంద గిరిజనులు మూడు తుపాకులను స్టేషన్‌కు తీసుకొచ్చి సరెండర్ చేశారన్నారు. గిరిజనుల వద్దనున్న నాటు తుపాకులను నెలాఖరులోగా స్టేషన్‌కు తీసుకువచ్చి అప్ప గించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అప్పలసూరి తదితరులు పాల్గొన్నారు.

పటిష్టమైన ప్రజాస్వామ్యానికి ఓటే పునాది

» అరకులోయ అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీవో అభిషేక్



ఎన్నికల కమిషన్ పంపిన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పీవో అభిషేక్, తదితరులు

పాడేరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పటిష్టమైన ప్రజాస్వామ్యానికి పునాది ఓటేనని అరకులోయ అసెంబ్లీ స్థానం రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీవో వి.అభిషేక్ అన్నారు. శనివారం రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఎన్నికల ప్రక్రియ, ఓటు హక్కు, వినియోగంపై ఎన్నికల కమిషన్ రూపొందించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అభిషేక్ మాట్లాడుతూ ప్రతీ ఓటరు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎటువంటి ప్రలోభాలకు లోనవకుండా నచ్చిన వారికి ఓటు వేయాలన్నారు. అమూల్యమైన ఓటు ప్రాధాన్యతను అందరూ గుర్తించాలని ఆయన సూచించారు. అలాగే ఈ పోస్టర్లను ప్రధాన కూడళ్లు, ప్రభుత్వ కార్యాలయాల్లో అతికించి ఓటర్లను చైతన్యం చేయాలన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వీవీఎస్.శర్మ, డీటీ అప్పలస్వామి, పీఎంయూ ప్రోగ్రాం అధికారి రామ్‌గోపాల్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



పరదానిపుట్టు పోలింగ్ కేంద్రంలో సిబ్బందికి సూచనలు ఇస్తున్న పీవో

పోలింగ్ కేంద్రాల్లో పక్కాగా ఏర్పాట్లు: పీవో

పెదబయలు, మార్చి 16: పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పక్కాగా ఏర్పాట్లు చేయాలని అరకు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ సిబ్బందికి ఆదేశించారు. మండలంలోని గసబ, పరదానిపుట్టు, పెదకోడాపల్లి తదితర పోలింగ్ కేంద్రాలను శనివారం ఆయన పరిశీలించారు. ఓటింగ్ యంత్రాలు, అధికారులు విధులపై ఈ సందర్భంగా పీవో అవగాహన కల్పించారు. అలాగే కేంద్రాల్లోకి ఓటర్ల ప్రవేశానికి ఓటు వేశాక బయటకు వెళ్లడానికి ప్రత్యేక మార్గాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీవో వెంట పలువురు అధికారులు ఉన్నారు.

గిడ్డి ఈశ్వరికి టికెట్ ఇవ్వాలని టీడీపీ శ్రేణుల భారీ ర్యాలీ

పాడేరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ టికెట్‌ను టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరికి ఇవ్వాలని కోరుతూ జిల్లా కేంద్రంలో పార్టీ నేతలు, కార్యకర్తలు శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక అసెంబ్లీ స్థానాన్ని భారతీయ జనతా పార్టీకి కేటాయిస్తారనే సమాచారం నేపథ్యంలో టీడీపీ శ్రేణులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. పురవీధుల్లో పసుపు జెండాలతో జై తెలుగుదేశం, జై గిడ్డి ఈశ్వరి అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. స్థానిక నియోజకవర్గంలో ఎంతో పటిష్టంగా ఉన్న టీడీపీకే టికెట్ కేటాయించాలని, ఇక్కడ సునాయాసంగా విజయం సాధిస్తుందని పేర్కొన్నారు. ఇతర పార్టీలకు ఈ సీటు కేటాయిస్తే తెలుగుదేశం పార్టీకి నష్టం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ అధిష్టానం పునరాలోచించి స్థానిక అసెంబ్లీ స్థానంలో టీడీపీ అభ్యర్థినే బరిలో దించాలని వారు కోరారు. ఈ ర్యాలీలో టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, క్లస్టర్, బూత్ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.



పాడేరులో ర్యాలీ చేపడుతున్న టీడీపీ శ్రేణులు

పాడేరు టిక్కెట్ టీడీపీకి ఇవ్వాలని ధారాలమ్మకు పూజలు

సీలేరు: పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ టిక్కెట్‌ను టీడీపీకి కేటాయించేలా చూడాలని ధారాలమ్మకు పార్టీ శ్రేణులు ప్రత్యేకంగా పూజలు చేశారు. శనివారం పార్టీ నేతలు ఎం.మణికుమారి, కె.సుబ్బారావు ఆధ్వర్యంలో ధారకొండ, గుమ్మిరేవుల పంచాయతీల్లోని పలు గ్రామాల్లో బాబు ష్యూరిటీ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మన్యం ప్రజల ఆరాధ్య దైవం ధారాలమ్మ సన్నిధికి వెళ్లి పూజలు చేశారు. ఈ సందర్భంగా మణికుమారి మాట్లాడుతూ చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాలని, పాడేరు అసెంబ్లీలో భారీ మోజార్టీతో విజయం సాధించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు దుచ్చరి చిట్టిబాబు, లోతా భీమరాజు, ఎస్.అబ్బాయి, బి.సత్యనారాయణపడాల్, ముక్కలి మహేష్, చంద్రకళ, పాపారావు పాల్గొన్నారు.

బోడిదొర కుటుంబానికి ఉపాధి కల్పించాలి

» జాతీయ అల్లూరి సీతారామరాజు సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు వీరభద్రరావు



బోడిదొర కుటుంబీకుల యోగక్షేమాలు తెలుసుకుంటున్న వీరభద్రరావు

కొయ్యూరు, మార్చి 16: స్వాతంత్ర్య సమరయోధులు గాం గంటందొర వారసుడు బోడిదొర కుటుంబానికి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని జాతీయ అల్లూరి సీతారామరాజు సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు డిమాండ్ చేశారు. శనివారం లంకవీధి వెళ్లి దివంగత బోడిదొర సమాధులను సందర్శించి నివాళి అర్పించారు. అనంతరం బోడిదొర కుటుంబీకులను పరామర్శించి, వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోడిదొర అంత్యక్రియలు అధికారికంగా నిర్వహించాల్సి ఉన్నా ప్రజా ప్రతినిధుల సమక్షంలో నామమాత్రంగానే చేయడాన్ని చూస్తే స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాల సంక్షేమంపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి తేటతెల్లమైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బోడిదొర కుటుంబీకులను ఆదుకునే దిశగా తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అల్లూరి యువజన సంఘం తరపున బోడిదొర కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి

చింతపల్లి, మార్చి 16: గిరిజన యువత చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సీఐ కె.రమేశ్ సూచించారు. సీపీఐ మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన బలపం పంచాయతీ కోరుకొండ గ్రామంలో శనివారం పోలీసులు మెగా వాలీబాల్ టోర్నమెంట్, వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకు ఈ పోటీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ పోటీల్లో 53 క్రీడా బృందాలు పాల్గొనగా గుంజువీధి క్రీడాకారులకు విజేతగా నిలిచినట్టు చెప్పారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి నగదు బహుమతులతో పాటు పోటీల్లో పాల్గొన్న ప్రతి క్రీడా బృందానికి కిట్లు అందజేశామన్నారు. గంజాయి సాగు, రవాణా జోలికి వెళ్లవద్దని, స్మగ్లర్ల ప్రలోభాలకు దూరంగా ఉండాలన్నారు. కాగా, వైద్య శిబిరంలో వైద్యులు 850 మందికి వైద్య సేవలు అందించినట్టు ఈ సందర్భంగా సీఐ తెలిపారు. కొంత మంది రోగులకు మెరుగైన చికిత్స కోసం మైదాన ప్రాంతాలకు తరలించామన్నారు. కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖరరావు, వైద్యులు ప్రభావతి, చందనశ్రీ, లక్ష్మీకాంత్, శివప్రసాద్, జగదీశ్ అన్నవరం, చింతపల్లి ఎస్ఐలు వెంకటరమణ, అరుణ్‌కిరణ్ పాల్గొన్నారు.



రోగులను ఆరోగ్య తనిఖీలు చేస్తున్న వైద్యాధికారులు

వలంటీర్ల తప్పులను ఎండగట్టాలి: కొణతాల

అనకాపల్లి, మార్చి 16: వలంటీర్లు చేస్తున్న తప్పులను ఎప్పటికప్పుడు ఎండగట్టాలని జనసేన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకృష్ణ పిలుపునిచ్చారు. శనివారం కొణతాల క్యాంపు కార్యాలయంలో జనసేన పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్లు ఇంటింటికీ తిరిగి వైసీపీ ఓట్లు గుర్తించి ఫొటోలు తీయడం గాని, వృద్ధులతో సంతకాలు సేకరించడం గాని చేసినట్టయితే వెంటనే వారిని అడ్డుకొని సమాచారం అందించాలన్నారు.

రోడ్డు పనులను అడ్డుకున్న టీడీపీ నేతలు

పరవాడ, మార్చి 16: రావాడ రెవెన్యూ పరిధిలోని శృంగారపాడులో గెడ్డవాగులోంచి రోడ్డు నిర్మాణానికి ఓ రియల్టర్ ప్రయత్నించగా టీడీపీ నాయకులు శనివారం అడ్డుకున్నారు. రియల్టర్ లేఅవుట్ కోసం గెడ్డవాగులోంచి రహదారి వేయడానికి వీల్లేదని తేల్చి చెప్పారు. ఈ విషయాన్ని రెవెన్యూ అధికారులకు తెలియజేయడంతో వారు అక్కడకు చేరుకుని పనులను నిలుపుదల చేశారు. పనుల కోసం తీసుకువచ్చిన ఎక్స్‌కవేటర్‌ను తరలించారు. దీంతో పనులు నిలిచిపోయాయి.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

చోడవరం, మార్చి 16: ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ సూర్యనారాయణ సూచించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆన్‌లైన్ మోసాల నియంత్రణపై శనివారం జరిగిన సదస్సులో మాట్లాడారు. ఆన్‌లైన్ మోసాలు, సోషల్ మీడియా పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎవరైనా మోసానికి గురైతే వెంటనే 1930 నెంబరుకు ఫిర్యాదు చేయాలని కోరారు.

సిట్టింగ్‌లకు జగన్ ఝలక్

... 5వ పేజీ తరువాయి

కోడలైన డాక్టర్ చెట్టి తనుజారాణిని అరకులోయ ఎంపీ అభ్యర్థిగా వైసీపీ ప్రకటించింది. అలాగే 2019లో పాడేరు అసెంబ్లీ నియోజకవర్గం ఇన్‌చార్జిగా పని చేసి ఆఖరి నిమిషంలో టికెట్‌ను కోల్పోయిన మత్స్యరాస విశ్వేశ్వరరాజును పాడేరు అసెంబ్లీ స్థానానికి సమన్వయకర్తగా నియమించిన వైసీపీ, ఆయనకే టికెట్ ఇస్తున్నట్టు ప్రకటించింది. అరకులోయ అసెంబ్లీ సమన్వయకర్తగా నియమితులైన హుకుంపేట జడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగానికే అరకులోయ ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం కల్పించింది.

అడుగంటిన మత్స్యగెడ్డ

» ఈ ఏడాది పరివాహక ప్రాంతీయులకు తప్పని తాగునీటి కష్టాలు

» ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని గిరిజనుల వేడుకోలు



సుజనకోట, కుమ్మరిపుట్టు మధ్యలో అడుగంటిపోతున్న మత్స్యగెడ్డ

ముంచంగిపుట్టు, మార్చి 13: మండలంలోని మత్స్యగెడ్డ పరివాహన ప్రాంతీయులకు ఈ ఏడాది తాగునీటి కష్టాలు తప్పేలే లేవు. సుజనకోట, దారెల. బూసిపుట్టు, లక్ష్మీపురం, రంగబయలు, బుంగాపుట్టు, పెదగూడ, జోలాపుట్టు, సంగడ తదితర పంచాయతీల పరిధిలోని గ్రామాల సమీపంలో ప్రవహిస్తున్న మత్స్యగెడ్డ పాయలు రోజురోజుకు అడుగంటిపోతున్నాయి. గత ఏడాది వర్షాలు ఎక్కువగా కురవకపోవడం, ఈ ఏడాది వేసవి ప్రారంభం నుంచే ఎండలు ఠారెత్తించడం వల్ల భూ గర్భజలాలు అడుగంటుతున్నాయి.

దాని కారణంగా మత్స్యగెడ్డ పరివాహక ప్రాంతాల్లో జీవనం సాగిస్తున్న గ్రామాల ప్రజలకు సైతం ఈ ఏడాది తాగునీటి కష్టాలు తప్పేటట్లు లేదు. తాగునీటి బావుల్లో నీరు తగ్గుముఖం పడుతుంది. బోరింగులు గంటలు తరబడి కొడితేగాని బిందె నీరు నిండని పరిస్థితి నెలకొంది. నిత్యం నిండుకుండలా తలపించే మత్స్యగెడ్డ పాయలు ప్రస్తుతం ఎక్కడపడితే అక్కడ నీరు లేక వెలవెలబోతున్నాయి. మత్స్యగెడ్డ ప్రవాహిత నీటిపై ఆధారపడి ఉన్న జోలాపుట్టు, డుడుమ జలాశయాలకు కూడా ఈ ఏడాది నీటి సమస్య తలెత్తే అవకాశం కనిపిస్తున్నది. ఇదే ఎండలు మరో వారం రోజులు కొనసాగితే మత్స్యగెడ్డ పాయలు పూర్తి స్థాయిలో అడుగంటిపోయే ప్రమాదం ఉంది. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని విన్నవించినా ఫలితం లేకపోతోంది. అయితే జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పాదనకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నీటి వినియోగంపై తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

సంక్షిప్తంగా..



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రామకృష్ణ

సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

చింతపల్లి, మార్చి 16: సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై సెక్టార్ అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని తహసీల్దార్ టి.రామకృష్ణ సూచించారు. రెవెన్యూ కార్యాలయంలో ఎంపీడీవో వీరసాయిబాబు, ఎస్ఐ అరుణ్ కిరణ్‌తో కలిసి ఎన్నికల ఏర్పాట్లపై సెక్టార్ అధికారులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో తగాదాలు చోటుచేసుకునే పోలింగ్ కేంద్రాలు, మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పూర్తి సమాచారం అందజేయాలన్నారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండగా ముందస్తు ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వివరాలు ముందుగా అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో పనసల ప్రసాద్, ఏటీడబ్ల్యూవో జయనాగలక్ష్మి, ఏవో శ్రీనివాసరావు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి

డుంబ్రిగుడ, మార్చి 16: ఎన్నికల నియమవళిని అందరూ పాటించాలని తహసీల్దార్ హైమావతి సూచించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో వివిధ పార్టీల నాయకులతో శనివారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పార్టీలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు తొలగించాలని సూచించారు. అలాగే ఎన్నికల నిబంధనల ప్రకారం ప్రచారానికి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల్లో మద్యం, డబ్బు పంపిణీ చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో టీడీపీ, వైసీపీ, సీపీఎం, జనసేన, బీజేపీ, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

నియమావళిపై అప్రమత్తత అవసరం

కొయ్యూరు, మార్చి 16: ఎన్నికల నియామవళి అమలుపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీఐ వెంకటరమణ, ఎంపీడీవో సీతయ్యానాయుడు స్పష్టం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయ ఉద్యోగులతో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోడ్‌ను పక్కాగా అమలు చేయాలన్నారు. పక్షపాత వైఖరి అవలంబించినట్టుగా ఫిర్యాదులు అందితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కొయ్యూరు, మంప ఎస్ఐలు రామకృష్ణ, లోకేష్‌కుమార్, తహసీల్దారు తదితరులు పాల్గొన్నారు.

అమరజీవి పొట్టి శ్రీరాములుకు నివాళులు

చింతపల్లి, మార్చి 16: స్థానిక ఏరియా ఆస్పత్రిలో పొట్టి శ్రీరాముల జయంతిని ఘనంగా నిర్వహించారు. అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి వైద్యులు, వైద్య సిబ్బంది పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ చంద్రశేఖరరావు మాట్లాడుతూ సత్యం, అహింస, హరిజనోద్ధరణ ఆశయాల సాధనకు జీవితాంతం కృషి చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాముల అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు ఇంద్ర ప్రియాంక, లావణ్య, సాయికృష్ణ, రమేశ్, ఏవో చంద్రశేఖర్, నర్సింగ్ సూపరింటెండెంట్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

అద్దె వాహనాలకు టెండర్లు

సీలేరు, మార్చి 16: జెన్‌కో సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని సీలేరు, డొంకరాయి, పొల్లూరు జల విద్యుత్ కేంద్రాల్లో 21 అద్దె వాహనాలకు రూ.1.59 కోట్ల అంచనా వ్యయంతో టెండర్లు నిర్వహించడానికి జెన్‌కో అధికారులు చర్యలు చేపడుతున్నారు. మూడు జల విద్యుత్ కేంద్రాల్లో సివిల్, ఓఅండ్‌ఎం సర్కిల్ పరిధిలో ఈ టెండర్లను నిర్వహించనున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి 21 వాహనాల్లో సీలేరు సివిల్ సర్కిల్‌లో ఎనిమిది వాహనాలకు రూ.54.3 లక్షల అంచనా వ్యయంతోను, మోతుగూడెం సీఈ కార్యాలయం పరిధిలో 13 వాహనాలకు రూ.1.05 కోట్ల అంచనా వ్యయంతో అద్దె ప్రాతిపదికన వాహనాల కోసం టెండర్లు సిద్ధం చేశారు. సీఈ కార్యాలయంలో జరిగే ఈ టెండర్లను 22న మధ్యాహ్నం ఒంటి గంటలోపే వేయాలని, అదే రోజు టెండర్లు తెరుస్తామని చెప్పారు. సీలేరు ఎస్ఈ కార్యాలయం పరిధిలో ఈ నెల 28న నిర్వహిస్తామని జెన్‌కో అధికారులు తెలిపారు.

అపరిచిత వ్యక్తులకు ఆశ్రయం కల్పించొద్దు

ముంచంగిపుట్టు, మార్చి 16: అపరిచిత వ్యక్తులకు ఆశ్రయం కల్పించరాదని ఎస్ఐ కె.రవీంద్ర సూచించారు. మండల కేంద్రంలో శనివారం జరిగిన వారపు సంతలో ఉదయం నుంచి సాయంత్రం వరకు వాహన తనిఖీలు చేపట్టారు. మారుమూల గ్రామాల నుంచి సంతకు వచ్చిన వాహనాలను, తిరుగు ప్రయాణమైన వాటిని క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా వాహన తనిఖీలతో పాటు రహదారుల పొడవునా డాగ్, బాంబ్ స్క్వాడ్లతో తనిఖీలు చేస్తున్నారు. అలాగే అపరిచిత వ్యక్తులు సంచరిస్తున్నట్టు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ తెలిపారు.

కాలువలో పడి గాయపడ్డ ఆవుకు చికిత్స



ఆవుకు చికిత్స చేస్తున్న పశు వైద్య సిబ్బంది

పెదబయలు, మార్చి 16: మండల కేంద్రంలోని మురుగు కాలువలో పడి గాయపడ్డ గుర్తు తెలియని ఆవుకు పశు వైద్యాధికారి సౌజన్యదేవి చికిత్స చేశారు. స్థానిక సాయిబాబా ఆలయం ఎదురుగా ఉన్న బంగారం దుకాణం వద్ద మురుగు కాలువలో ఆవు పడిపోయి గాయపడింది. శనివారం ఉదయం వార్డు సభ్యులు జీవన్‌కుమార్ 1962 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో పారిశుధ్య కార్మికుల సాయంతో కొన ఊపిరితో ఉన్న ఆవును పశువుల ఆస్పత్రికి తరలించారు. పశు వైద్య సిబ్బందితో కలిసి డాక్టర్ సౌజన్యదేవి చికిత్స చేయడంతో ఆవు కోలుకుంది.

క్రైం... crime news

రైలు ప్రమాదంలో గుర్తు తెలియని యువకుడి మృతి


మృతి చెందిన యువకుడు

అనకాపల్లి టౌన్, మార్చి 16 : అనకాపల్లి-ఆనందపురం రోడ్డు కింద రైల్వే ట్రాక్‌పై శనివారం గుర్తు తెలియని మృతదేహాన్ని కనుగొన్నామని దువ్వాడ జీఆర్‌పీ పోలీసులు తెలిపారు. విజయవాడ నుంచి విశాఖకు వెళ్లే మార్గంలోని పది అడుగుల దూరంలో మృతదేహం లభించిందని, మృతుని వయసు 30 ఏళ్లలోపు ఉంటుందని తెలిపారు. మృతుడు బ్లూ కలర్ జీన్‌ఫ్యాంట్ తప్ప శరీరంపై ఎటువంటి దుస్తులు లేవని తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు దువ్వాడ జీఆర్‌పీ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందజేయాలని హెడ్‌కానిస్టేబుల్ రమేష్ తెలిపారు.

వివాహితను వేధిస్తున్న వ్యక్తిపై కేసు

ఎలమంచిలి, మార్చి 16 : మండలంలోని అచ్యుతపురం గ్రామానికి చెందిన వివాహితను వేధిస్తున్నట్టు అందిన ఫిర్యాదు మేరకు గ్రామానికి చెందిన బి.ప్రసాద్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఎస్ఐ సింహాచలం తెలిపారు. విచారణలో పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని తెలిపారు.

ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో ఎస్పీ సమీక్ష


అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ కేవీ మురళీకృష్ణ

అనకాపల్లి రూరల్, మార్చి 16 : జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం రాత్రి ఎన్‌ఫోర్స్‌మెంట్ నిర్వహించే వివిధ శాఖల అధికారులతో ఎస్పీ కేవీ మురళీకృష్ణ సమీక్ష సమావేశం నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలను ప్రలోభాలకు గురిచేసేందుకు నగదు, మద్యం, ఉచిత కానుకలను పంపిణీ చేసే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఇటువంటి వాటికి అడ్డుకట్ట వేసేందుకు ముందస్తు ప్రణాళికతో చెక్‌పోస్టుల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. చెక్‌పోస్టుల వద్ద ముమ్మరంగా తనిఖీలను నిర్వహించాలన్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ అభ్యర్థి కోసం వైసీపీ తర్జనభర్జన

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

అనకాపల్లి పార్లమెంట్ అభ్యర్థిగా ఎవరిని బరిలో దించాలనే దానిపై వైసీపీ తర్జనభర్జన పడుతోంది. కూటమి తరఫున బీజేపీ అభ్యర్థిగా రాజ్యసభ సభ్యుడు సీఎం రమేశ్ ఎన్నికల బరిలో ఉంటారని ప్రచారం జరగడంతో దీటైన అభ్యర్థి కోసం వైసీపీ ప్రయత్నిస్తున్నట్టు తెలిసింది. సిట్టింగ్ ఎంపీ భీశెట్టి సత్యవతికి మళ్లీ అవకాశం ఇవ్వడానికి అధిష్ఠానం సుముఖంగా లేదు. ఇప్పటికే ఈ స్థానాన్ని బీసీ కేటగిరీకి కేటాయించిన నేపథ్యంలో మాడుగుల ఎమ్మెల్యే బూడి ముత్యాలునాయుడును ఎంపీ అభ్యర్థిగా ప్రకటించి, మాడుగుల నుంచి బూడి కుమార్తె, కె.కోటపాడు జడ్పీటీసీ సభ్యురాలు ఈర్ల అనురాధని పోటీలో పెట్టాలని భావిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. అయితే ఇప్పటికే మాడుగుల అసెంబ్లీ అభ్యర్థిగా బూడి ముత్యాలనాయుడును అధిష్ఠానం ప్రకటించింది. ఈ నేపథ్యంలో మార్పు చేస్తారా?, లేదా? అనే దానిపై ఉత్కంఠ నెలకొంది.

సత్యవరంలో ఘనంగా గౌరీ శంకరుల జాతర

పాయకరావుపేట రూరల్, మార్చి 16: సత్యవరంలో గౌరీశంకరుల జాతర శనివారం ఘనంగా జరిగింది. తెల్లవారు జాము నుంచి భక్తులు అమ్మ వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. జాతరలో గరగల డ్యాన్సులు, ఆర్కెస్ట్రా, కోలాటం, శక్తి వేషాలు, కర్రసాము, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను అలరించాయి. టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి వంగలపూడి అనిత, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ చిక్కాల రామారావు, జనసేన నాయకులు గెడ్డం బుజ్జి, టీడీపీ నాయకులు పెదిరెడ్డి చిట్టిబాబు, గొర్రెల రాజుబాబు, దేవవరపు రాజుబాబు, తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

చంద్రబాబును కలిసిన మాజీ ఎమ్మెల్యే 'బోళెం'


చంద్రబాబుతో మాజీ ఎమ్మెల్యే ముత్యాలపాప, కుటుంబ సభ్యులు, అయ్యన్న

నర్సీపట్నం, మార్చి 16 : నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే బోళెం ముత్యాలపాప, ఆమె కుటుంబ సభ్యులు టీడీపీ జాతీయ అధ్యక్షుడు నా చంద్రబాబునాయుడును శనివారం మర్యాదపూర్వంగా కలిశారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆధ్వర్యంలో విజయవాడలోని చంద్రబాబు నివాసానికి వెళ్లి ఇరవై నిమిషాల పాటు ఆయనతో మాట్లాడారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ విజయానికి కలిసికట్టుగా పని చేయాలని చంద్రబాబు వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో బోళెం ముత్యాల పాప భర్త వెంకటరమణ మూర్తి, ఆమె మరిది రామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి


పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్, ఎస్పీ

అనకాపల్లి కలెక్టరేట్, మార్చి 16 : అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా శనివారం కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం 58 రోజులు ఆమరణ నిరాహారదీక్ష చేసి ప్రాణాలర్పించిన మహా పురుషుడని అన్నారు. డీఆర్‌ఓ దయానిధి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అలాగే, జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమంలో ఎస్పీ కేవీ మురళీ కృష్ణ పాల్గొని అమరజీవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భాషా ప్రయుక్త రాష్ట్రం కావాలని ఉద్యమించిన మహానుభావుడని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ విజయభాస్కర్, డీటీసీ కేవీ ప్రకాశరావు పాల్గొన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	92.00
లైవ్ ధర	112.00
విత్ స్కిన్	196.00
స్కిన్ లెస్	206.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	425
విజయనగరం	429
శ్రీకాకుళం	429

పరిమితికి మించిన లోడుతో వాహనాలు

- ఆందోళన చెందుతున్న పట్టణ ప్రజలు
- పోలీస్ స్టేషన్ల ముందు నుంచే రాకపోకలు
- పట్టించుకోని పోలీసులు


ఎలమంచిలి పట్టణంలో పెద్ద రాళ్లతో వెళుతున్న భారీ వాహనం

ఎలమంచిలి, మార్చి 16: పట్టణంలో అధిక లోడు వాహనాల రాకపోకలతో పట్టణవాసులు భీతిల్లుతున్నారు. పెద్ద బండరాళ్లు ఉన్న వాహనాలు వేగంగా వెళుతుండడంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. మునిసిపాలిటీలోనే పట్టపగలు దర్జాగా సమయం అంటూ లేకుండా ఇష్టారాజ్యంగా భారీ వాహనాలు వెళుతున్నా పోలీస్ యంత్రాంగం పట్టించుకోవడం లేదు. ఆటోలో అదనపు ప్రయాణికుడు ఉంటే ప్రతాపం చూపించే పోలీసులు ఈ వాహనాలను వదిలేయడాన్ని పట్టణవాసులు విమర్శిస్తున్నారు. మునిసిపాలిటీతోపాటు నియోజకవర్గ కేంద్రం కావడంతో నిత్యం ఉదయం నుంచి ప్రజల రాకపోకలతో పట్టణ రోడ్లు రద్దీగా ఉంటాయి. ఈ రద్దీలో కూడా భారీ వాహనాలు, బండరాళ్ల వాహనాలు వెళుతుండడంతో వెనుక నుంచి వెళుతున్న వాహనదారులు భయపడుతున్నారు. విచిత్రమేమిటంటే.. ఈ వాహనాలన్నీ పోలీస్ స్టేషన్ల ముందు నుంచే తిరుగుతున్నా సరే పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది. పట్టణంలో రూరల్, పట్టణ పోలీస్‌స్టేషన్‌ల ముందు నుంచే పగలు, రాత్రి అని తేడా లేకుండా అధిక బరువుతో ఉన్న వాహనాలు దూసుకువెళుతున్నాయి. తాళ్లపాలెం నుంచి ఎలమంచిలి పట్టణం మీదుగా రాంబిల్లి వైపు ప్రయాణించే ఈ వాహనాలపై ఉన్న బండరాళ్లు అదుపుతప్పి కిందపడితే ప్రాణాలు పోతాయనే ఆందోళన చెందుతున్నారు. సుమారు 50 వాహనాల వరకూ నిత్యం తిరుగుతున్నాయి. సామర్థ్యాన్ని మించి అధిక బరువుతో ప్రయాణించే వాహనాలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

అల్లూరి పార్కుపై వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం

ఐదేళ్లుగా పట్టించుకోకపోవడంతో శిథిలావస్థకు కట్టడాలు

- కార్యరూపం దాల్చని నాటి మంత్రి ముత్తంశెట్టి, డిప్యూటీ సీఎం రాజన్నదొర హామీలు
- అల్లూరి యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు 'పడాల'


పార్కులో శిథిలమైన కట్టడాన్ని చూపుతున్న వీరభద్రరావు

కృష్ణాదేవిపేట, మార్చి 16 : స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు, గంటందొర సమాధులున్న గొలుగొండ మండలం కృష్ణాదేవిపేటలో గల అల్లూరి పార్కుపై గత ఐదేళ్లుగా వైసీపీ పాలకులు నిర్లక్ష్యం చూపారని అల్లూరి యువజన సంఘం జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు ఆరోపించారు. ఈ కారణంగా నేడు పలు కట్టడాలు శిథిలావస్థకు చేరుకున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆయన అల్లూరి పార్కును సందర్శించారు. తొలుత అల్లూరి, గంటందొరల సమాధుల వద్ద నివాళులర్పించిన అనంతరం మాట్లాడుతూ సమాధులున్న కట్టడం శ్లాబ్ పెచ్చులూడిపోయిందని వివరించారు. పర్యాటకులు సేదదీరేందుకు నిర్మించిన షెడ్లు శిథిలావస్థకు చేరుకోవడాన్ని విలేకరులకు చూపించారు. వైసీపీ ప్రభుత్వంలో పర్యాటక శాఖా మంత్రిగా ఉన్న సమయంలో ముత్తంశెట్టి శ్రీనివాసరావు, డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర పార్కు అభివృద్ధికి రూ.కోటి పది లక్షలు ప్రకటించి ఏళ్లు గడుస్తున్నా ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని మండిపడ్డారు. ఇక్కడ పర్యాటకులకు తాగునీటి సౌకర్యం కల్పించే దిక్కులేకుండా పోయిందన్నారు. స్వాతంత్ర్య సమరయోధులకు వైసీపీ ప్రభుత్వం ఇచ్చే గౌరవం ఇదే అని ఆయన ప్రశ్నించారు. తక్షణమే పార్కు అభివృద్ధికి నిధులు విడుదల చేయకుంటే రానున్న ఎన్నికల్లో పర్యాటకులు, ఈ ప్రాంత ప్రజలు వైసీపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అల్లూరి యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి అంబటి వరహాలరాజు, కార్యవర్గ సభ్యుడు పంచాడ వెంకటరమణ, గంటందొర కుటుంబీకులు పాల్గొన్నారు.

రాష్ట్ర శ్రేయస్సు కోసమే పొత్తు

- జనసేన జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జనసేన జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు

తుమ్మపాల, మార్చి 16: రాష్ట్ర శ్రేయస్సు కోసమే టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తుగా ముందుకెళుతున్నాయని జనసేన జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. శనివారం టీడీపీ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత ఐదేళ్లలో అధికార పార్టీ నాయకులు అభివృద్ధిని పక్కన పెట్టి దోచుకోవడం.. దాచుకోవడమే పనిగా పాలన సాగించారన్నారు. ఆదివారం చిలకలూరిపేటలో ప్రజాగళం పేరుతో మహాసభను మూడు పార్టీలు కలిసి నిర్వహిస్తున్నాయన్నారు. సుమారు ఎనిమిది లక్షల మంది ప్రజలు ఈ సభకు హాజరుకానున్నారని చెప్పారు. పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై ప్రజాగళాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. రాష్ట్రాన్ని 20 ఏళ్లు వెనక్కి తీసుకువెళ్లిపోయిన ఘనత జగన్మోహన్‌రెడ్డిదేనన్నారు. బూటకపు హామీలతో ఐదేళ్లపాటు రాష్ట్ర ప్రజలను నయవంచన చేశారన్నారు. కనీసం రాజధాని నిర్మాణాన్ని చేపట్టలేని జగన్‌రెడ్డి ఏకంగా మూడు రాజధానుల ప్రకటన హాస్యాస్పదమన్నారు. ఉమ్మడి విశాఖజిల్లాలో చిన్న సమస్యను కూడా పరిష్కరించలేక పోయారన్నారు.

రెల్లి సామాజికవర్గంపై వైసీపీ సర్కారు చిన్నచూపు

- ఓటు బ్యాంకుగానే చూస్తుండడం దారుణం
- హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలి
- సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పాపారావు పిలుపు


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు పాపారావు

నాతవరం, మార్చి 16: రాష్ట్రంలో 30 లక్షల మంది జనాభా ఉన్న రెల్లి సామాజికవర్గాన్ని వైసీపీ ప్రభుత్వం ఓటు బ్యాంకుగానే చూస్తుందని రెల్లి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు యర్రంశెట్టి పాపారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. అత్యంత దుర్భర స్థితిలో జీవనం గడుపుతున్న రెల్లి కులస్థుల అభివృద్ధికి ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. శనివారం నాతవరం మండలంలోని తాండవ సెంటర్‌లో జరిగిన జిల్లా స్థాయి రెల్లి కులస్థుల సమావేశంలో మాట్లాడారు. హక్కుల సాధనకు అంతా ఐక్యంగా పోరాటం సాగించాలని పిలుపునిచ్చారు. రెల్లి కులస్థులు చట్ట సభలకు వెళితేనే వెనుకబడిన ఉన్న తమ సామాజిక వర్గానికి అన్నివిధాలా న్యాయం జరుగుతుందన్నారు. నేడు ప్రభుత్వం కులగణన చేస్తున్నా తోటలలో, పాకల దగ్గర ఉంటున్న రెల్లి కులస్థుల వివరాలు తీసుకోకుండా తప్పుగా కులగణన చేస్తున్నారని ఆరోపించారు. రిజర్వేషన్లలో రెల్లి కులస్థులకు సామాజిక న్యాయం జరగాలన్నారు. అలాగే రామచంద్ర కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంతకుముందు వెన్నలపాలెం నుంచి తాండవ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. తుని- నర్సీపట్నం రూట్‌లోని తాండవ సెంటర్ వద్ద మానవహారంగా ఏర్పడి సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాతవరం మండల నాయకులు బంగారు సూరిబాబు, బంగారు అబ్బు, బుచ్చియ్యపేట మండల మహిళా అధ్యక్షురాలు ముత్యాల త్రివేణి, బంగారు వెంకటేశ్వరరావు, వడ్డాది దేముడు, సంఘం చోడవరం మండల అధ్యక్షుడు పొట్నూరి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్యపై అజయ్‌పురం ఆదివాసీల ఆందోళన

- గ్రామంలో అంపూర్తిగా ఉన్న ట్యాంకు ఎక్కి మహిళలు నినాదాలు


నీటి సమస్యపై నినాదాలు చేస్తున్న గ్రామస్థులు

రావికమతం, మార్చి 16 : తాగు నీటి సమస్యపై మండలంలోని అజయ్‌పురం ఆదివాసీ మహిళలు శనివారం గ్రామంలో వినూత్న రీతిలో నిరసన తెలిపారు. అసంపూర్తిగా ఉన్న వాటర్ ట్యాంకుపైకి ఎక్కి నీటి కష్టాలు తీర్చాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం నాయకుడు పాంగి అజయ్‌కుమార్ మాట్లాడుతూ చీమలపాడు పంచాయతీ శివారున ఉన్న అజయ్‌పురంలో 130 మంది ఆదివాసీలు నివాసం ఉన్నారన్నారు. ఈ గ్రామం కొండ శిఖరంపై ఉండడంతో వేసవి కాలంలో తాగునీటికి వీరంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు వాపోయారు. గ్రామానికి జల్ జీవన్ మిషన్ పథకంలో రక్షిత మంచినీటి పథకం నిర్మించి, ఇంటింట కుళాయిల ద్వారా నీటిని అందించాల్సిందిగా కోరారు. గ్రామంలోని అసంపూర్తిగా ఉన్న ట్యాంకు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు, పాంగి పద్మ, పి.వైలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల బకాయిల విడుదలలోనూ జగన్‌రెడ్డి గిమ్మిక్కులు

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు


విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు

తుమ్మపాల, మార్చి 16: ఉద్యోగులు, ఉపాధ్యాయుల పెండింగ్ బకాయిల విడుదలలోనూ జగన్‌రెడ్డి గిమ్మిక్కులు చేస్తున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు విమర్శించారు. శనివారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఉద్యోగులు జగన్‌రెడ్డి వలలో పడే రోజులు పోయాయన్నారు. తాజాగా ప్రకటించిన డీఏలతో ఇప్పటికిప్పుడు వైసీపీ ప్రభుత్వంపై పడే భారం పెద్దగా లేదని, దాన్ని కొత్త ప్రభుత్వంపైకి నెట్టేశారన్నారు. జనవరి డీఏ నగదు 2024 ఏప్రిల్ జీతంతో కలిపి మే నెలలో ఉద్యోగులకు ఇస్తారని జగన్ చెప్పడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. ఐదేళ్లలో గుర్తుకు రాని డీఏలు ఎన్నికల నోటిఫికేషన్‌కి ముందు ప్రకటించడం ఎన్నికల స్టంటేనన్నారు. రాష్ట్ర పెన్షనర్ అసోసియేషన్ కార్యదర్శి బుద్ద కాశీ మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులకు ఇవ్వాల్సిన డీఆర్ ఉత్తర్వులను విడుదల చేయలేదని, వీరికి బకాయిల్ని నగదు రూపంలో చెల్లించాలని, పాత బకాయిలనే చెల్లించని ప్రభుత్వం కొత్త వాటిపై స్పష్టత ఇవ్వలేదని ఆవేదన వ్యక్తపరిచారు. ఒక్కొక్క ఉద్యోగికి జగన్ సర్కారు రూ.2.5 లక్షలకు పైగా ఇప్పటికీ బకాయిలు ఉన్నాయని, 2022 జూలైలో డీఏ మంజూరు ఉత్తర్వులు ఇచ్చినా ఇంతవరకు ప్రయోజనాలు అందలేదన్నారు. 2018 జూలై 2019 జనవరి డీఏలకు సంబంధించిన దాదాపు 66 నెలల బకాయిలను చాలామంది ఉద్యోగులకు చెల్లించకుండా.. సాంకేతికంగా ఇచ్చేసినట్టు చూపించి ఉద్యోగుల నుంచి ఆదాయం పన్ను కూడా మినహాయించారని, ఇంతకంటే దుర్మార్గమైన చర్యలు మరొకటి ఉంటుందా అని ఆయన ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో నోబెల్ చారిటబుల్ ట్రస్ట్ గౌరవాధ్యక్షుడు కాండ్రేగుల సత్యనారాయణ పాల్గొన్నారు.

అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్‌కు జాతీయ అవార్డు


అవార్డు అందుకుంటున్న డాక్టర్ జగన్నాథరావు, శ్రీదేవి

అనకాపల్లి అగ్రికల్చర్/కొత్తూరు, మార్చి 16: అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలోని పంటకోత అనంతర ఇంజనీరింగ్ టెక్నాలజీ సెంటర్‌కు జాతీయ స్థాయి తృతీయ ఉత్తమ అవార్డు లభించింది. లూథియానాలో ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు పంటకోత అనంతర ఇంజనీరింగ్ టెక్నాలజీపై జరిగిన 39వ అఖిలభారత సమన్వయ పరిశోధనా పథకం వార్షిక సమావేశంలో ఏడీఆర్ డాక్టర్ పీవీకే జగన్నాథరావు, అగ్రి ఇంజనీరింగ్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీదేవికి ఈ అవార్డును అందజేశారు. అనకాపల్లి పరిశోధనా స్థానం పంటకోత అనంతర ఇంజనీరింగ్ టెక్నాలజీ పరిశోధనలో జాతీయ స్థాయిలో ఖ్యాతి గడించింది.